


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

బుధవారం,11 మార్చి 2026 | 8 పేజీలు





కోట్లాది రూపాయల 'సార్టెక్స్' యంత్రాల వెలుగులో.. సాగుతుందని చేబుతున్న చీకటి 'కెమికల్' మాయాజాలం! అది తాజా బియ్యమా? లేక రసాయనాలతో కడిగిన పాత రేషన్ బియ్యమా? అధికారుల టెస్ట్ ట్యూబ్‌లో గ్రీన్ రంగు రావడమే లక్ష్యంగా.. గింజ గింజపై సోడియం పూత పూస్తున్న 'రీసైక్లింగ్' మాఫియా. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నా, ప్రజాధనం వృధా అవుతున్నా.. ఆధునిక సాంకేతికత చాటున సాగుతుందని తెలుస్తున్న ఈ 'సైంటిఫిక్' దోపిడీపై "సూర్య" బ్యూరో అందిస్తున్న క్షేత్రస్థాయి విశ్లేషణ!

**సూర్యబ్యూరో - ఉమ్మడి గోదావరి జిల్లాలు :**

## సి.ఎం.ఆర్ సేకరణలో

# 'క్షార' కుతంత్రం!










### పాత బియ్యానికి 'సోడియం' పూత..

### పరీక్షల్లో గ్రీన్ రంగు మాయాజాలం!

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రైతుల నుండి ధాన్యం సేకరించి,ప్రజలకునాణ్యమైన బియ్యాన్ని అందించడమే లక్ష్యంగా 'కస్టమ్ మిల్లింగ్ రైస్' ప్రక్రియను చేపట్టింది.అయితే, ఈ పవిత్ర ఆశయానికికొందరుమిల్లర్ల స్వార్థం అడ్డుపడుతోందనే అనుమానాలు చాలా ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం 10రకాల పరీక్షలు దాటిన తర్వాతే బియ్యాన్ని సేకరించాల్సి ఉండగా, అందులో కీలకమైన 'బియ్యం వయస్సు పరీక్ష'ను నీరుగార్చేందుకు మాఫియా కొత్త దారులను వెతుక్కుందనే చర్చ జోరుగా సాగుతోంది.

ఏమిటా 'విరుగుడు'.. ఎలా ఈ మాయ?

- తరువాయి 2లో..

- తేమ శాతం కోసం నీటి పిచికారీ..
- గింజపై కృత్రిమ రక్షణ కవచం!
- ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్న 'రీసైక్లింగ్' మాఫియా?
- సామర్థ్య అధికారుల విజ్ఞతకే పరీక్ష
- క్షేత్రస్థాయిలో జరుగుతోందేమిటో నిగ్గు తేల్చాలి !

# బాణాసంచా కేంద్రాలపై ఎస్పీ నిప్పులు !







- నిబంధనలు ఉల్లంఘిస్తే ఊచలు లెక్కపెట్టాల్సిందే
- ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ హెచ్చరిక
- కాకినాడ జిల్లాలో హై-అలర్ట్.. తయారీ కేంద్రాల్లో ఎస్పీ స్వయంగా తనిఖీలు..
- భద్రతా లోపాలపై సీరియస్

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** జిల్లాలో బాణాసంచా తయారీ మరియు విక్రయ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే సమాచారంతో కాకినాడ జిల్లా పోలీస్ బాస్ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఒక్కసారిగా క్షేత్రస్థాయిలోకి దిగారు. మంగళవారం జిల్లాలోని పలు కీలక ప్రాంతాల్లో ఆయన నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు బాణాసంచా వ్యాపారుల్లో వణుకు పుట్టించాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన ఈ సందర్భంగా అత్యంత తీవ్రంగా హెచ్చరించారు.

**అణువణువూ తనిఖీ.. ఎస్పీ గర్జన!**

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కరప పోలీస్ స్టేషన్ పరిధిలోని వేలంగి, నడకుదురు గ్రామాల్లో పర్యటించి, అక్కడ ఉన్న తయారీ యూనిట్లను సందర్శించారు. అనంతరం ఇంద్రపాలెం పరిధిలోని గంగనాపల్లి, కొవ్వూరు గ్రామాల్లోని విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు.

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : నిల్వ కేంద్రాల్లో అగ్నిమాపక యంత్రాలు పనిచేయకపోవడం, ఇసుక బకెట్లు లేకపోవడం వంటి అంశాలపై ఎస్పీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**- పరిమితికి మించి నిల్వలు** : అనుమతి పొందిన పరిమాణం కంటే అదనంగా మందుగుండు సామాగ్రిని నిల్వ ఉంచిన కేంద్రాల వివరాలను సేకరించి, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**లైసెన్సుల రద్దుకు ఆదేశం...**ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేసే వారిపై ఎస్పీ ఉక్కుపాదం మోపారు. తనిఖీల్లో వెల్లడైన లోపాల ఆధారంగా సంబంధిత లైసెన్స్ అథారిటీకి నివేదికలు

- తరువాయి 2లో..

## జలజీవన్ మిషన్‌తో

# గ్రామాలకు జీవనాడి

-రూ.34.30 లక్షలతో మంచినీరు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**కె.గంగవరం,మేజర్‌న్యూస్** : రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం శివల గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద రూ.34.30లక్షలతో 40వేలలీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మంగళవారం శంకుస్థాపన చేశారు. మండల ప్రజా పరిషత్ అధికారి ఎం. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాసంశెట్టి

- తరువాయి 2లో..

# సి.ఎం.ఆర్ సేకరణలో 'క్షార' కుతంత్రం!

మొదటిపేజి తరువాయి

తాజా ధాన్యాన్ని మిల్లింగ్ చేసినప్పుడు వచ్చే బియ్యాన్ని పొటాషియం సంబంధిత రసాయనంతో పరీక్షించినప్పుడు అది 'ఆకుపచ్చ' రంగులోకి మారాలి. అప్పుడే అదితాజామిల్లింగ్‌గా పరిగణించ బడుతుంది. కానీ,పాత బియ్యాన్ని రీసైకిల్డ్ సీఎంఆర్‌గా పంపే క్రమంలో కొందరు మిల్లర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 'తేమ శాతం'. నిల్వ ఉన్న బియ్యంలో తేమ 9 లేక 10కి తగ్గిపోతుంది. దీనిని కవర్ చేసి తేమ శాతం 13.5 లేక 14 శాతానికి పెంచడానికి మరియు రసాయన పరీక్షల్లో నెగ్గడానికి మిల్లర్లు ఒక వింతైన మార్గాన్ని అనుసరిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయమైన నమ్మదగిన సమాచారం.

**– క్షార పొర :** పడిపోతున్న తేమ శాతాన్ని పెంచడానికి బియ్యంపై నీటిని పిచికారీ చేసే సమయంలో, అందులో 'సోడియం బై కార్బోనేట్' ను కలుపుతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.

– రంగు మార్చే మంత్రం : ఈ సోడియం మిశ్రమం బియ్యం గింజపై ఒక అదృశ్య 'క్షార పొర'ను ఏర్పరుస్తుంది. టెక్నికల్ అధికారులు టెస్ట్ ట్యూబ్‌లో 5 గ్రాముల బియ్యం వేసి రసాయనం కలపగానే, గింజ లోపలి గుణంతో సంబంధం లేకుండా పైన ఉన్న ఈ సోడియం పొర ప్రభావంతో ద్రావణం వెంటనే 'ఆకుపచ్చ' రంగులోకి మారిపోతోంది.

ఆధునిక యంత్రాల చాటున 'సాంకేతిక' మాయాజాలం?

నేడు మిల్లుల్లో కోట్లాది రూపాయల విలువైన 'సార్టెక్స్' వంటి అత్యాధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి బియ్యాన్ని తెల్లగా మెరిసేలా చేస్తాయి తప్ప, గింజ యొక్క రసాయన స్వభావాన్ని మార్చలేవు. అయితే, ఈ యంత్రాలలోని 'ఆటోమేటిక్ పాలిషర్' వ్యవస్థ ద్వారా బియ్యంపై నీటిని ఆవిరిలా చిలకరించే ప్రక్రియలో, రహస్యంగా సోడియం మిశ్రమాన్ని కలుపుతున్నారనే బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. సార్టెక్స్ యంత్రం బియ్యాన్ని కొత్తవిగా చూపిస్తుంటే, ఈ రసాయన పూత అధికారుల పరీక్షల్లో 'గ్రీన్' రంగు వచ్చేలా చేస్తోందని క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఆధునిక సాంకేతికతను వాడుకుంటూనే, ఇలాంటి 'సైంటిఫిక్ మోసాలకు' పాల్పడుతున్నారనే అనుమానం ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ప్రభుత్వ సొమ్ము.. మాఫియా పాలు?**

ప్రభుత్వం నాణ్యమైన బియ్యం కోసం మిల్లర్లకు మిల్లింగ్ ఛార్జీలు, గొడౌన్ అద్దెలు కోట్లాది రూపాయలు చెల్లిస్తోంది. అలాగే బియ్యం పురుగు పట్టకుండా ఉండడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి స్టోరేజ్ మేనేజ్మెంట్ ప్రక్రియను నిర్వహిస్తోంది. అయితే, మిల్లుల్లో ఫ్రెష్ మిల్లింగ్ జరగకపోవడమే ఇక్కడ అసలు సమస్యగా మారుతోంది. పాత బియ్యాన్ని నిల్వ చేయడం వల్ల అవి పురుగు పట్టి, ప్రజలు తినడానికి పనికిరాకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది.

నిజానికి తాజా బియ్యం అందాల్సిన చోట, అక్రమ మార్గాల్లో పాత బియ్యాన్నే మళ్లీ ప్రభుత్వానికి అప్పగిస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మాఫియా తన జేబుల్లో వేసుకుంటోంది. ఈ దారుణమైన పరిస్థితికి కారణం అధికారుల పర్యవేక్షణ లోపమా లేక వారిపై ఉండే ఒత్తిళ్లా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఫ్రెష్ మిల్లింగ్ సేకరణ జరగకపోవడం వల్ల ప్రభుత్వ ఆశయం నీరుగారిపోవడమే కాకుండా, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నట్లు కనిపిస్తోంది.

**అధికారుల విజ్ఞతకే వదిలేద్దాం!**

నిబంధనలు ఎన్ని ఉన్నా, మాఫియా వాటికి విరుగుడు కనిపెడుతూనే ఉంది. అయితే, ఈ దొంగ దారిని అడ్డుకోవాల్సింది క్షేత్రస్థాయిలో ఉండే అధికారులే. బియ్యం కేవలం రంగు మారడాన్నే ప్రామాణికంగా తీసుకోకుండా, గింజపై ఉన్న ఆ 'కృత్రిమ పొర'ను గుర్తించగలగాలి.

**– అధికారులు గమనిస్తున్నారా?:**

బియ్యంపై ఉన్న ఈసోడియం పూతను అధికారులు కనిపెట్టలేకపోతున్నారా? లేక నిబంధనల చట్రంలో ఉండిపోయి కేవలం 'రంగు'ను చూసి సరిపెట్టుకుంటున్నారా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.మాఫియా కనిపెట్టిన ఈ 'విరుగుడు'కు డిఎం నాయక్, డీఎస్ఓ సత్యనారాయణ రాజు లు తమ విజ్ఞతతో అడ్డుకట్ట వేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. నిక్కచ్చిగా, నాణ్యమైన ఫ్రెష్ మిల్లింగ్ బియ్యాన్ని మాత్రమే సీఎంఆర్‌గా సేకరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

# లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామం లారీని వ్యాను ఢీకొన సంఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. రాజమండ్రి నుంచి సామర్లకోట వైపు కెనాల్ రోడ్లో వస్తున్న లారీని సామర్లకోట నుండి రాజమండ్రి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యాన్ లారీ లారీని ఢీ కొట్టినీ ఆగకుండా వెళ్ళిపోయింది. లారీ డ్రైవర్ చేతిని బయటికి పెట్టడంతో తీవ్ర చేతికి గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి స్థానికులు 108కి సమాచారం అందించి గాయపడిన వ్యక్తి నీ చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన లారీ డ్రైవర్ వివరాలు తెలియ లేదు.

# పేదరికాన్ని నిర్మూలించేది విద్య

**– అధ్యక్షులు వెంకటేష్**



**గోపాలపురం, మేజర్ న్యూస్ :**మనిషి విద్య ద్వారా మాత్రమే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల శాఖ అధ్యక్షులు దొడ్డి గర్ల వెంకటేష్ అన్నారు. ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని మంగళవారం సాయంత్రం అందజేశారు. స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి వెంకటేష్ మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అజ్ఞానం అనే అంధకారాన్ని విద్యనే జ్ఞాన వెలుగు ద్వారా తొలగించవచ్చు అన్నారు. పార్డ్ సంస్థ కార్యదర్శి చింతలపూడి భాస్కరరావు మాట్లాడుతూ పేదరికం విద్యకు ఆటంకం కాదన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన కడుపేదలు నాణ్యమైన విద్యను అభ్యసించి నేడు ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉన్నారన్నారు. అటువంటివారిని యువత ఆదర్శంగా తీసుకొని నాణ్యమైన విద్యను అభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కోశాధికారి ఎం కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఎన్నో విద్యా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టుతున్నదని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాత ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధిలో భాగంగా బడి తరువాత పిల్లలకు ట్యూషన్లు, ఉచిత మెగా వైద్య శిబిరాలు, వివిధ రకాల బాధితులకు వస్తు ఆర్థిక సహాయం, ప్రమాదాల వారిని పడిన వారికి అంబులెన్స్ ఉచిత వాహన సౌకర్యం తదితర కార్యక్రమాల చేపడుతున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వింజమూరి సుబ్బారావు, రేవుల గడ్డ రత్న భాస్కర్, పాముల తిరుపతయ్య, ఆర్ఎంపి వైద్యులు శ్రీనివాస్, కొండె సుబ్బారావు, జేమ్స్, డీలర్ ఏడుకొండలు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాణాసంచా కేంద్రాలపై ఎస్పీ నిప్పులు !

మొదటిపేజి తరువాయి

పంపాలని, నిబంధనలు పాటించని పక్షంలో లైసెన్సులను రద్దు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. "ప్రజా భద్రత కంటే ఏదీ ముఖ్యం కాదు" అని ఆయన తేల్చి చెప్పారు.

అప్రమత్తమైన యంత్రాంగం..జిల్లా ఎస్పీతో పాటు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, స్థానిక ఎస్సైలు మరియు రెవెన్యూ అధికారులు భారీ బందోబస్తుతో పాల్గొన్నారు. ఈ తనిఖీలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతాయని, నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

## జలజీవన్ మిషన్‌తో గ్రామాలకు జీవనాడి

మొదటిపేజి తరువాయి

సత్యం మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మహత్తర కార్యక్రమమని అన్నారు. శివల గ్రామంలో నిర్మించబోయే ఈ వాటర్ ట్యాంక్ పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకదృష్టి సారి స్తున్నారని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ అధికారులు, డీసీ నిడదవోలు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, బీసీ సెల్ మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేంద్ర, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, నిడదవోలు రవి, కాకి అప్పారావు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీలకు సహకరించాలని పెద్దాపురం డివిజనల్ పంచాయితీ అధికారిణి బాలామణి అన్నారు. మంగళవారం జగ్గంపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఇంటి పన్నుల బకాయి వసూళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించలని లేని పక్షంలో నోటీసులు జారీచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీలలో 2025-2026వ సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, మొత్తం రూ. 2 కోట్ల 59 లక్షల 94 వేలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ వసూళు వేగవంతం చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు.

## ఆకట్టుకున్న సైకత శిల్పం




**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో మాతృత్వం తరహా కార్యక్రమం మన పెద్దాపురం గ్రూప్ నిర్వహిస్తున్న 100వ వారానికి చేరుకోనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ప్రభుత్వాసుపత్రిలలో మాతృత్వం తరహా కార్యక్రమం జరగాలనే లక్ష్యంతో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మాతృత్వంతో కూడిన సృష్టిలో అపూరూపం అమ్మ ప్రేమ ప్రతిబింబిస్తూ సైకత శిల్పాన్ని మలచడం జరిగింది.

# నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంప్‌లో 'ఆదిత్య' ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు 7 రోజులపాటు రాయచూర్‌లో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంప్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారని ఆదిత్య డిగ్రీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్శిటి 24-02-2026 నుండి 02-03-2026 నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్.సింధు మన నగర సంస్కృతి, సంప్రదాయాలను అక్కడ వాసులకు తెలియపరచటమే కాకుండా వివిధ రాష్ట్రాల సంస్కృతులు, అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ మై భారత్ ద్వారా ఇద్దరు విద్యార్థినులు భువనేశ్వర్‌లో నిర్వహించిన యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో నిర్వహించిన వివిధ అంశాలమీద విద్యార్థినులకు అవగాహన కల్పించారని, భిన్నత్వంలో ఏకత్వం ఏలా వుంటుందో ఇప్పటి తరానికి తెలియపరుస్తుందని అభిప్రాయ పడ్డారు. ఇందులో భాగంగా ది. 23-02-2026 నుండి 27-02-2026 వరకు నిర్వహించిన కార్యక్రమంలో యువజన అధికారి హాజరు అయ్యారని అన్నారు. ఈ అవకాశం తమ విద్యార్థినులకు దక్కినందుకు హర్షం వ్యక్తంచేశారు. ఈ అవకాశాన్ని దక్కించుకున్న ప్రథమ సంవత్సరం విద్యార్థినులను మరియు కళాశాల జాతీయ సేవా కార్యనిర్వహణాధికారి పి.సురేఖదేవిని, ఆదిత్య విద్యాసంస్థల అధిపతి డా॥ యన్ శేషారెడ్డి, సెక్రటరీ డా॥ యన్. సుగుణా రెడ్డి అభినందించారు.

# మడికి శ్రీరాములు దంపతులకు ఆదర్శ దంపతుల అవార్డు

**అమలాపురం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు - 2026 సందర్భంగా హైదరాబాద్‌లో శ్రీత్యాగరాయ గానసభ మెయిన్ హాల్ నందు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ యువ ఆర్ట్ థియేటర్స్ వారి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు బి.ఆర్.వెంకటరమణ అధ్యక్షతన, గౌరవాధ్యక్షులు ఆర్.చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన వేడుకలలో, ఎల్.ఐ.సి సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన అమలాపురం పట్టణానికి చెందిన సామాజికవేత్త మడికి శ్రీరాములు, సతీమణి మడికి రోజాపుష్పం దంపతులను అవార్డుతో సత్కరించడం జరిగింది. ఈ అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది నాకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని, ఈఅవార్డు సామాజిక సేవ పట్ల మా భాధ్యతను మరింత పెంచిందని ఈ సందర్భంగా మడికి శ్రీరాములు తెలియజేసారు. ఈ వేడుకలలో వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు చేస్తున్న వారికి ప్రముఖ రాజకీయ నాయకులు మరియు సినీ ప్రముఖల చేతుల మీదుగా భారత నారీ శక్తి అవార్డ్స్, ఆదర్శ దంపతుల అవార్డ్స్ మరియు సేవా రత్న అవార్డ్స్ ఇవ్వడం జరిగింది.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ ఇందిర శోభన్, బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శ్రీమణి, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం. వెంకటేశ్వరి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డా. నంబూరి కనకదుర్గ, సినీ నటి రోహిణీ శ్రీనివాసన్, సినీ నటి రమా రెడ్డి, సంఘసేవకులు వెంకట సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

# బొజ్జిగుప్ప గ్రామానికి సందర్శించిన బొజ్జి రెడ్డి, గొర్ల సునీత



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలంలోని బొజ్జిగుప్ప గ్రామాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్ల సునీత గ్రామంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారక్క నాగులమ్మ తల్లి జాతరకు విచ్చేసి దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న, అధికారులు పనులు చేయకపోయినా ప్రతి ఒక్కరూ మా వద్దకు వచ్చి తెలియపరిస్తే ఆ సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు గిరిజన ప్రజలకు తెలియజేయడం జరిగింది. అలాగే మన ఆదివాసి యొక్క మూలాలని సాంప్రదాయాలని సాంస్కృతిని ఎన్నటికీ మరవరాదని, మన ఆచారాలు మన పండగలు మన జాతికి మూలాలని, మన కట్టబాట్లను మరవకుండా మరెన్నో మంచి మంచి కార్యక్రమాలు మన గిరిజనుల బిడ్డలు చేయాలని వారు తెలియజేశారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు బొజ్జిగుప్ప గ్రామానికి సందర్శించినందుకు గ్రామ ప్రజలు మరియు గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉకే భద్రయ్య, తుర్రం కాటయ్య, తెల్లం బాబురావు, మూడే సతీష్ కుమార్ నాయక్, తుర్రం సూర్యం, కోడి శ్రావణ్, ఉకే రవి, సీసం వెంకటేష్, కనితి సూరిబాబు, తుర్రం విజయ్, తుర్రం అజయ్, కాక శివాజీ, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసి ఉద్యోగస్తుల సమస్యలపై ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి వినతి పత్రం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండల పర్యటనకు మంగళవారం వచ్చిన ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డిని ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ బృందం కలిసి సాలువతో సన్మానించడం జరిగింది. తదానంతరం 'ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం' త్వరగా రూపకల్పన చేసి, త్వరలో ప్రకటించే డీఎస్సీ 2026లో ప్రకటించే నోటిఫికేషన్ లో అమలు చేసి, ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. చైర్మన్ సానుకూలంగా స్పందించి చట్టం రూపకల్పనకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఆదివాసి ఉద్యోగస్తుల సమస్యలపై కూడా కులంకషంగా వివరించడం జరిగింది. అన్ని సమస్యలపైన సానుకూలంగా స్పందించారు. ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు పూసం శ్రీను చైర్మన్‌తో మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన హక్కులు, చట్టాలను అమాలుకు కృషి చేయాలని, భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ప్రాంతాలలో ఆర్టికల్ 244 (1),పేరా 4 ప్రకారం ఉద్యోగ నియామకాలు శత శాతం స్థానిక ఆదివాసులకి ఇవ్వాలని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ టీఏసి ఏపీ తీర్మానం తేదీ: 18-06-2020 ప్రకారం ప్రత్యేక ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక శాఖలలో పనిచేస్తున్న ఆదివాసి ఉద్యోగస్తులు ఉద్యోగ, సర్వీసు పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్‌కి వివరించడం జరిగింది. అన్ని విషయాలపై సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి నూప అనిల్, కుర్సం వీరయ్య, బాబు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసి పూజర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

**- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి వినతి పత్రం సమర్పణ ఆదివాసి సంక్షేమ పరిషత్**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండల పర్యటనకు వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డిని చిన్నంపేట, బొజ్జిగుప్ప గ్రామస్తులు కోర్స వీరస్వామి పటేల్, ఊకే భద్రయ్య పటేల్, సరియం రాంబాబు పూజారి, తుర్రం కాటయ్య వేపర్ మరియు ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం సాలువతో సత్కరించడం జరిగింది. తదనంతరం ఐదవ షెడ్యూల్ భూభాగంలో పాస్టర్లకు, పూజరులకు, ఇమామ్‌లకు ఇచ్చిన విధంగానే ఆదివాసి పూజరులకు గౌరవ వేతనం ఇచ్చి ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. చైర్మన్ సానుకూలంగా స్పందించి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమాలుకు కృషి చేస్తానని అన్నారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ ఎటపాక ఇన్చార్జి కంగాల కోటేశ్వరరావు చైర్మన్‌తో మాట్లాడుతూ ఐదు షెడ్యూల్ ప్రాంతాలలో ఐటీడీఏల ద్వారా లేదా గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా ఆదివాసీలు హిందువులు కాదు కాబట్టే వారి యొక్క దేవాలయాలను అభివృద్ధి కొరకు మిగతా మతాలైన హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, మత పెద్దలకు ఇచ్చిన విధంగానే ఆదివాసీలను ప్రకృతి ఆరాధకులుగా గుర్తిస్తూ పైన పేర్కొన్న మతాలకు మత గురువులకు కల్పించే సంక్షేమ పథకాలను ఆదివాసి పూజరులు, పటేళ్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరడం జరిగింది. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బాడిసి వెంకటేశ్వర్లు, తుర్రం అర్జున్, పూనెం శ్రీకాంత్, పూనెం సురేష్, గుండి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడకు మంచి ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలి

**- జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరం స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశవ్యాప్తంగా మంచి ర్యాంకు వచ్చేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ ఆదేశించారు.

మంగళవారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన స్వచ్ఛ స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమాని జేసీ అపూర్వ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటి వద్దనే కంపోస్ట్ యార్డ్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, తడి-పొడి చెత్తను వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చనే అంశాలపై కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అవగాహన కల్పించారు. గృహ స్థాయిలోనే చెత్తను వర్గీకరించడం, కంపోస్టింగ్ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశవ్యాప్తంగా కాకినాడ నగరానికి మంచి ర్యాంకు సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు చెత్త వర్గీకరణ, కంపోస్టింగ్ వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని 233 మంది రిసోర్స్ పర్సన్లకు స్వచ్ఛ సర్వేక్షన్ కిట్స్ ను పంపిణీ జేసీ అపూర్వ భరత్, కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కిట్స్ ద్వారా రిసోర్స్ పర్సన్లు ప్రజల్లో పరిశుభ్రత, చెత్త నిర్వహణ, కంపోస్టింగ్ వంటి అంశాలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్వామిత్వ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 13,321 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

**- పంపిణీకి సిద్ధంగా 5.3 లక్షల ప్రాపర్టీ కార్డులు**
**- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వామిత్వ పథకం ద్వారా గుర్తించిన 13,321 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని, 1,067 గ్రామాలకు సంబంధించి 5.3 లక్షల ప్రాపర్టీ కార్డులు పంపిణీ చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లో స్వామిత్వ పథకం అమలు, కేటాయించిన నిధులపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో స్వామిత్వ పథక రాష్ట్ర ప్రోగ్రాం మేనేజ్మెంట్ యూనిట్ (ఎస్పిఎంయు) తోపాటు సమాచార, కమ్యూనికేషన్ కార్యక్రమాల కోసం నిధులు కోరగా, కేంద్రం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే స్వామిత్వ పథకం ద్వారా పెద్ద స్థాయి మ్యాపింగ్ కోసం సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రూ.85.80 లక్షలు అందించామని తెలిపారు. స్వామిత్వ పథకం అమలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పటికే తన సొంత వనరులతో 26 జిల్లాల్లో 70



నిరంతర ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్లు ఏర్పాటు చేయగా ఇందులో కాకినాడ జిల్లాలో 3 స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఏపీలో గత ప్రభుత్వం ప్రాపర్టీ కార్డులు ముద్రణలో చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్ది నూతన కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తుందని కేంద్రమంత్రి వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# కాకినాడలో కమిషనర్ పర్యటన

**- త్రాగునీటిని వృథా చేయొద్దని ప్రజలకు సూచన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థ అందిస్తున్న త్రాగునీటిని ప్రజలు వృధా చేయకుండా పొదుపుగా వినియోగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో నీటిని వినియోగించాలని ఆయన పేర్కొన్నారు.

మంగళవారం ఉదయం కాకినాడ నగరంలోని శాంతినగర్ ప్రాంతంలో కమిషనర్ సత్యనారాయణ పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా విగ్రహం వద్ద డ్రైనేజీపై అక్రమంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్, వెంటనే అధికారులను ఆదేశించి అక్రమణలను తొలగింపజేసి డ్రైనేజీని శుభ్రపరిచే చర్యలు చేపట్టించారు. అనంతరం నందమూరి తారకరామారావు పార్కును కూడా ఆయన సందర్శించి అక్కడి నిర్వహణను పరిశీలించారు. డివిజన్ పర్యటనలో భాగంగా త్రాగునీటితో కార్లను శుభ్రం చేస్తున్న వ్యక్తిని గుర్తించిన కమిషనర్ తీవ్రంగా మందలించి, సంబంధిత ఇంటి యజమానికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రెవెన్యూ కాలనీలో ఉన్న కంపోస్ట్ యార్డును పరిశీలించిన కమిషనర్‌కు అక్కడ ఉన్న సమస్యలను సిబ్బంది వివరించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే డైరీ ఫారం సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను కూడా ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో చాలా మంది త్రాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇది సరికాదని, వేసవికాలంలో నీటి కొరత రాకుండా ఉండాలంటే ప్రజలు త్రాగునీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు.ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, టీపీఎస్ రామ్మోహన్, డీఈ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ కమిషనర్‌ని కలిసిన గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భూపతిరాజు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భూపతిరాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు) మంగళవారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణను కలిసి గ్రంథాలయానికి రావలసిన బకాయిలు సుమారు తొమ్మిది కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని వాటిని తక్షణం విడుదల చేయాలని ఈశ్వర్ రాజు కమిషనర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులను పిలిచి అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి బడ్జెట్లో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ స్పందించిన విధానానికి గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కామిషనర్ రాహుల్ మీనా వారిని కలిసి బకాయి ఉన్న 17 కోట్ల గ్రంథాలయ సెస్సు నుండి కొంతమంది మేరకు చెల్లించ మని కోరగా కమిషనర్ వెంటనే స్పందించి చెల్లిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ ఆవరణలో వేసవి దృశ్య పాఠకులకు సౌకర్యార్థం వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసి కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి కావలసిన పుస్తకాలను కూడా ఏర్పాటు చేసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చైర్మన్ వెంట సంస్థ కార్యదర్శి పి.నాగరాజు, కే.కిషోర్, ఎం.శ్రావ్య, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే

**- మహిళల జీవితాల్లో కాంతి జ్యోతి నింపిన ప్రేమ స్వరూపిణి**
**- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యమని, మహిళల హక్కుల కోసం పోరాడిన భారతీయ తొలి ఉపాధ్యాయిని, కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే నేటితరానికి ఆదర్శమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పేరుకొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే మహిళా విద్య అభివృద్ధికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాజంలో మహిళలకు విద్య అందేలా ఎన్నో అవరోధాలను ఎదుర్కొని పోరాడిన మహానుభావురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహిళల సాధికారతకు, సమాన హక్కులకు ఆమె చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత మహిళను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ గౌరవకరమని, ఆమె చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, తెలుగుదేశం పార్టీ రామచంద్రపురం పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకె సాంబశివరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, యువ నాయకులు కుడుపూడి ఫణి తేజ, ప్రకాష్ కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలు నిర్మాణాలు.. ముడుపులే పునాదులు

- జగ్గంపేటలో పక్కా కమర్షియల్
- అనుమతులు గృహ నిర్మాణానికి.. నిర్మించేది షాపింగ్ కాంప్లెక్స్
- కాసులు కురిపిస్తే నిర్మాణానికి ఒకే
- ఇది జగ్గంపేట పంచాయతీ అధికారుల తీరు





**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** మమ్మల్ని అడిగేదిఎవరు.. ఆపేదెవరు.. మాకు రాజకీయదన్ను..అధికారులు అండదండలు ఉన్నాయి..అన్నట్లుగా ఉంది నియోజవర్గ కేంద్రమైన జగ్గంపేట మేజర్ గ్రామపంచాయతీలో కొందరు నిర్మాణదారులు తీరు.బిల్డింగ్ నిర్మాణం కావాలన్నా లే అవుట్‌లు వెయ్యాలన్న పంచాయతీ అధికారుల అనుమతులు విధిగా తీసుకోవాలి. అయితే తీసుకున్న అనుమతులకు చేపట్టే నిర్మాణాలకు ఏమాత్రం పొంతన ఉండని పరిస్థితి. ఇది పంచాయతీ అధికారుల కళ్ళ ఎదుటే యదేచ్చగా సాగుతున్న ముడుపుల మత్తులో తమకేమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఖజానాకు రావలసిన పెద్ద మొత్తంలో సొమ్ములకు నష్టం ఏర్పడుతున్న ఉన్నతాధికారులు తనకు ఏమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు జగ్గంపేట నడిబొడ్డున ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయం వెనుక భాగంలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీనికి నివాస గృహానికి అనుమతి తీసుకుంటూ ఫ్యాన్ అప్రూవల్ చేయించుకున్నారు. నివాస నిర్మాణం మాటున 9కమర్షియల్ షాపులు నిర్మాణాలు దాదాపు 70 శాతం పూర్తయి. ప్లాన్ అప్రూవల్‌కి విరుద్ధంగా పక్కా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నా పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదంటే ఎంత భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తతంగంలో అధికారులకు కొంత స్థానిక నాయకుల జేబుల్లోకి మరికొంత చేరుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే గోకవరం రోడ్డులో కిరణ్ కంటి ఆసుపత్రి ఎదురుగా భారీ స్థాయిలో కమర్షియల్ బిల్డింగు నిర్మాణం అవుతుంది ఇది కూడా నివాసానికి అప్రూవల్ తీసుకున్నారు. ఈ రెండే కాకుండా గ్రామంలో చాలాచోట్ల ఇటువంటి నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా మార్పు చేసి ప్రతి విషయాన్ని ప్రజలకు తెలిసే విధంగా సమాచారాన్ని అందిస్తుంది. గ్రామ పంచాయతీల నుంచి ఆదాయ వనరులను సమకూర్చుకుంటుంది.

జగ్గంపేటలో అధికారుల అలసత్వంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను నిలుపుదల చేసేలా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి చర్యలు చేపట్టి పంచాయతీలకు ఆదాయ వ నరులు సమకూర్చేలా విషయాలని పలువురు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు కోరుతున్నారు.

**చర్యలుతీసుకుంటాం :** నిబంధనలకు విరుద్ధంగా జగ్గంపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై డివిజనల్ పంచాయతీ అధికారిణి బాలామణిని మేజర్ న్యూస్ వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. షాపింగ్ నిర్మాణ అనుమతులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

## పెద్దాపురం మున్సిపాల్టీని స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా చేస్తూ ఉత్తర్వులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘం కౌన్సిల్ తీర్మానం మేరకు పెద్దాపురం మున్సిపల్ సంఘం యొక్క స్థాయిని రెండవ గ్రేడ్ నుండి స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేయుటకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పెద్దాపురం పురపాలక సంఘం యొక్క స్థాయిని రెండవ గ్రేడ్ నుండి స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

## పోతవరం ఎంపీపీ పాఠశాలలో పాడైపోయిన గుడ్లు





- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే శిరీష దేవి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో కాలం చెల్లిన సరుకులతో వంట చేసి, పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారంగా సరఫరా చేసి, వారి ప్రాణాలతో సంబంధిత అధికారులు చెలగాటం ఆడుతున్నారు. మెనూలో లోపాలు సహించేది లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు హెచ్చరిస్తున్నా విద్యాశాఖ, గిరిజన సంక్షేమాధికారుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. దేవీపట్నం మండలం పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాజాగా కాలం చెల్లిన ఆహార పదార్థాలు విద్యార్థులకు సరఫరా చేసారు. రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి దేవీపట్నం మండలంలో మంగళవారం పలు పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించారు. దేవీపట్నం మండలం పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసి ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గుడ్లు నాణ్యత లేకపోతే గుత్తేదారులపై చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారుల దృష్టికి ఆహార సమస్యలు తీసుకువెడుతున్నట్టు ఎమ్మెల్యే శిరీషాదేవి పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల మెనూలో ఎలాంటి లోపాలు ఉన్నా సహించేది లేదన్నారు. ఇటీవల కాలంలో పాఠశాలల్లో పాడైపోయిన గుడ్లు విద్యార్థులకు అందించిన సంఘటనపై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించి వాస్తవంగా రికార్డులు ప్రకారం 181గుడ్లు ఉండాల్సి ఉండగా తేడా ఉన్నట్లు గుర్తించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ దొర, వంట మనిషి రామలక్ష్మికు హెచ్చరిక జారీ చేశారు. గుత్తేదారులు సకాలంలో అందించే పూర్తి నాణ్యతతో ఉన్న సరుకులు మాత్రమే తీసుకోవాలన్నారు. ఒకవేళ గుత్తేదారులు నాణ్యత లేని సరకులు సరఫరా చేస్తే తిరస్కరించాలన్నారు. అలా కాని పక్షంలో నిర్లక్ష్యం ఎవరిదైతే ఉందో వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో అన్ని రకాల పదార్థాలు తనిఖీ చేసి ఎమ్మెల్యే పరిశీలించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు పెట్టొద్దని సూచించారు. దీనిపై ఐటిడిఎ పిఓ, జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. గుత్తేదారుల్ని అవసరం అయితే మార్చడానికి ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. అనంతరం దామనపల్లి ఆశ్రమ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తీర్ణత శాతం పెంపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలోని పలు సమస్యలు, కోతులు సమస్య ఉందని, క్రీడా మైదానం లెవెలింగ్ చేయాలని, ప్రహరీ గోడలపై పెన్సింగ్ సదుపాయం కల్పించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆమె పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె.సత్యనారాయణ, సహాయ గిరిజన సంక్షేమ అధికారి జల్లి శంభుడు, ప్రధానోపాధ్యాయురాలు బి.చంద్రకళ, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముంద్రు మధుసూధనరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగాధర రావు, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ కుమార్, ఎఎమ్‌సి డైరెక్టర్ జొన్నల రాంబాబు, క్లస్టర్ ఇంచార్జి ఎమ్.వీర వెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, పుట్టపల్లి మల్లేష్, నాగేశ్వరరావు, దబ్బ నాని, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పశు వైద్యశాలల పనితీరుపై సమీక్ష



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పశు వైద్యశాల పని తీరుపై గొల్లప్రోలులో మంగళవారం పశుసంవర్ధక శాఖ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వడ్డీ శ్రీధర్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో పశు వైద్యశాలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించి వ్యాధుల నివారణ టీకాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమానికి సంబంధించి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. తొండంగి, గొల్లప్రోలు మండలాల పరిధిలోని పశు వైద్యశాలల కార్యకలాపాలను అధికారులు పరిశీలించారు. గొర్రెలు, మేకలలో పిపిఆర్ టీకాలు, నత్తల నివారణ, పశుగ్రాసం పెంపకం, గోకులాల అభివృద్ధి మరియు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా పిఠాపురం అగ్రహారం సుందరయ్య కాలనీలో మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా సంఘం నాయకులు కె.మణి మాట్లాడుతూ భారతదేశంలో మొట్ట మొదటిగా మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, అందరికీ చదువు చెప్పాలనే ఉద్దేశంతో జ్యోతిరావు పూలే అండతో స్కూలు స్థాపించడం జరిగిందన్నారు. ఈ స్కూల్ కి వెళ్లే మార్గంలో సావిత్రిబాయి పూలే మీద పేడ నీళ్లు చిమ్ముతూ, దుర్భాషలాడుతూ నీవు చదువు చెప్పడానికి పనికిరావు, చెప్పకూడదు అని గ్రామ పెద్దలు ఎంత అవమానించినా... ఆమె లెక్క చేయలేదని, భర్త చనిపోతే భార్యకు గుండు గీయించాలనే సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం జరిగిందన్నారు. మహిళ చదువుకుంటేనే దేశం పురోగమిస్తుందని ఆనాడే మహిళలకు కొన్ని హక్కులు కావాలని, విద్య కూడా సమానంగా ఉండాలని ఆమె భారతదేశ ప్రజలకు సందేశం ఇచ్చారని అన్నారు. కానీ నేటి ప్రపంచంలో మహిళలు రక్షణ లేకుండా పోయిందని, మహిళలు పనిచేస్తున్న చోట సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, మహిళ అనే చిన్న చూపుతో నేటి సమాజం చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు అంగన్వాడి ఎం.గంగాభవాని, ఐద్వా, నాయకులు కృష్ణవేణి, సుజాత, కె.శివకుమారి, నాగు, ఎం.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్య రక్షణకు కీలక అడుగు

– పెరవలిలో ఉచిత హెచ్పివి వ్యాక్సినేషన్ ప్రారంభం




**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలంలో బాలికల ఆరోగ్య రక్షణకు కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుండి బాలికలను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత హెచ్పివి వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ ఘనంగా ప్రారంభమైంది. మార్చి 10వ తేదీ మంగళవారం పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ కార్నెల్ల సీతారాం ప్రసాద్, వైద్యులు డాక్టర్ రాజనాల ప్రసాద్, డాక్టర్ తేజశ్రీ ఎంపీటీసీ రాపాక ప్రమీల రాణి మరియు ఇతర ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం బాలికల్లో భవిష్యత్తులో వచ్చే ప్రమాదకరమైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే నివారించడం. ఇందుకోసం గార్డసిల్ అనే హ్యూమన్ పప్పిల్లోమా వైరస్ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు మరియు ఆరోగ్య ఉపకేంద్రాలలో 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు ఉన్న ఆడబిడ్డలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, గత కొద్ది రోజులుగా ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించి, ఈ ప్రాంతంలో ఉన్న బాలికలను గుర్తించారు. ఈ సర్వేలో మొత్తం 325 మంది బాలికలను లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం వచ్చే మూడు నెలల పాటు కొనసాగుతుందని, ఈ సమయంలో గుర్తించిన బాలికలందరికీ పూర్తిగా ఉచితంగా వ్యాక్సిన్ అందించబడుతుందని వైద్యులు తెలిపారు. పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజనాల ప్రసాద్ మరియు డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనేది మహిళల్లో ఎక్కువగా కనిపించే ఒక ప్రమాదకరమైన వ్యాధి అని చెప్పారు. అయితే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేకంగా చిన్న వయసులోనే హెచ్పివి వ్యాక్సిన్ తీసుకుంటే భవిష్యత్తులో ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని వారు వివరించారు.

## భవిత కేంద్రం నందు ఫిజియోథెరపి సేవలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో ఎంఇఓల సూచనల మేరకు స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు మంగళవారం భవిత, సహిత ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన తెలుపుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని భవిత ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టమూరులో అగ్నిప్రమాదం

– ఆస్థి, పాడి పశువులు ఆహుతి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కట్టమూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఉండవిల్లి వెంకన్న బాబుకి చెందిన పాక నందు షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పాలిచ్చే గేదెలు, మూడు చివుడు గేదెలు దగ్ధమయ్యాయని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే పెద్దాపురం ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు పరిశీలించారు.

## రూ. 15 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కృషితో రూ. 15 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం గ్రామ నాయకులు శంకుస్థాపన చేశారు. గ్రామ టీడీపి నాయకులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో సీసీ రహదారుల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ తెదేపా నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే చినరాజప్పకు, దానికి ప్రోత్సాహం అందించిన జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్‌కు నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యరావు, తలారి శ్రీను, పంచాయితీ సెక్రెటరీ, పాలిక నరేంద్ర, ముమ్మిడి శ్రీనివాస్, చల్లా దుర్గాప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న పశువుల వ్యానుపై దాడి

– ఇరువురి వ్యక్తుల అరెస్టు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న వ్యానుపై దాడి చేసి ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బొలెరో వ్యాన్ సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం ఇంచార్జ్ ఏఎస్పీ బొడ్డు హేమంత్, రాజవొమ్మంగి సి ఐ గౌరీ శంకర్ ల ఆదేశాల మేరకు ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి లోని అల్లూరి జంక్షన్ లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో 16 ఆవుదూడలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి ఆవు దూడలను గోశాలకు తరలించి, బొలెరో వాహనం సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ ఎస్ శివకుమార్ తెలిపారు.

## పులి ఈ ప్రాంతంలోనే ఉంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

– సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పెద్దపులి మండలంలోని జి.శరభవరం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉందని ఆయా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ డి ఎఫ్వో సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆవు దూడను పులి దాడి చేసిన సంఘటనలో పరిశీలించడానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు పశు వులను అడవుల్లోకి వదల వద్దని సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకో కోవాలన్నారు. ఇప్పటివరకు జన వాసాల్లోకి వచ్చి మనుషులపై దాడి చేసిన సంఘటనలు లేవని జి శరభవరం గ్రామ శివారులో ఆవు దూడ పై పులి దాడి చేయడం వాస్తవమే అన్నారు. త్వరలోనే నష్టపరిహారం చెల్లిస్తామని ఎక్కడైనా ఇలాంటి సంఘటన జరిగితే ఫారెస్ట్ అధికారులు దృష్టికి తీసుకెళ్తే క్రైమ్ చేసి నష్ట పరిహారం చెల్లించడం జరుగుతుందని సుబ్బారెడ్డి తెలిపారు. పెద్దపులి కదలికలు రేడియో కాలర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తమ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. స్థానిక రేంజ్ అధికారి ఉషారాణి ఉన్నారు.

## బాణ సంచా ప్రమాదంలో ఏడు కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేత



సామర్లకోట, మేజర్ న్యూస్ : వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్‌లు అన్నారు. సామర్లకోట మండలంలో గత నెలలో జరిగిన బాణాసంచా కేంద్ర భారీ విస్ఫోటనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏడు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 20 లక్షల రూపాయల పరిహార చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రారంభం నుండి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రమాద ఘటనలో అక్కడకు అక్కడే మృతి చెందిన 20 మంది బాధితులకు మరుసటి రోజే మంత్రుల చేతుల మీదుగా రూ. 20 లక్షల పరిహార చెక్కులను అందించామన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స మృతి చెందిన కార్మికులైన సామర్లకోట కుమ్మరి వీధి పరిసర ప్రాంతాలకు చెందిన దర్శిపాటి లోవరాజు(40), దర్శిపాటి రాజు(30), వేమగిరి లోవరాజు(38), పల్లపాటి వీర శ్రీను(45), కాశేటి శ్రీను(33), పెద్దాపురం కొండయ్య పేటకు చెందిన మోర్త శ్రీను(30), వేట్లపాలెం గ్రామానికి చెందిన సప్పా సత్యవేణి (34) కుటుంబాలకు పరిహారం చెక్కులను అందజేశారు. ఇకపైన కుటుంబాలకు ఏ అవసరం ఉన్న కూటమి ప్రభుత్వం తక్షణ స్పందించి వారిని ఆదుకుంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి వి ఎస్ లక్ష్మణ్ రావు, సామర్లకోట మండల మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ అందుగుల మణి కుమారి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, జిల్లా నాయకులు పిట్టా జానకి రామారావు, జనసేన పట్టణ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాసరావు (సరోజ వాసు), తెదేపా నాయకులు నిమ్మకాయల కిరణ్, బలుసు శ్రీనివాస్, తాతపూడి కృష్ణ బాబు, దాట్ల శ్రీనివాస్, గోర్తి సత్యనారాయణ, గొల్లపల్లి కామరాజు, గుదాల శంకర్, కాళ్ళ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కానూరు పిహెచ్సిలో హెచ్పీవీ వ్యాక్సిన్ శిబిరం ప్రారంభం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కే.హేమరాజు ఆధ్వర్యంలో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నుండి బాలికల రక్షణకు ప్రభుత్వము వారిచే ఉచిత వాక్సినేషన్ క్యాంపెయిన్లు నిర్వహించడం జరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానూరు పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉన్న 14 సంవత్సరముల పూర్తి అయ్యి 15 సంవత్సరాలలోపు ఆడబిడ్డల అందరికీ గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తగా గార్డసిల్ అనే హ్యూమన్ పప్పిలోమా వైరస్ (హెచ్ పి వి) వాక్సినేషన్ ఉచిత క్యాంపెయిన్ మార్చ్ 10 వ తేదీ మంగళవారం నుండి ప్రభుత్వము వారిచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానూరులో ప్రారంభోత్సవం జరిగింది.ఇందుకుగాను గత కొద్ది రోజుల నుండి గ్రామంలో ఏ ఎన్ ఎం మరియు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 251 బాలికలను లబ్ధిదారులుగా గుర్తించడమైనది.

10 మార్చి కానూరు 1 మరియు కానూరు 2 గ్రామం పరిధిలో గల 14 సంవత్సరం పూర్తి అయి 15 సంవత్సరం జరుగుతున్న బాలికలకు 14 మందికి వాక్సిన్ వేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో యమ్పిపి కార్పొరేటర్ల సీతారాం ప్రసాద్, మరియు గ్రామ సర్పంచ్ భావన మధు పూర్ణచందు, సొసైటీ అధ్యక్షులు వాకలపూడి వీర్రాజు,యమ్పిటీసి కోలా సీతయ్య నాయుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కే. హేమరాజు, సిహెచ్ఓ కే. జయమణి, యమ్ పి హెచ్ ఈఓ ఏ. రాజమోహన్, మరియు సిబ్బంది ఏయన్యమ్ టి. రాజేశ్వరి, టి. కోమలి, యమ్యల్హెచ్పి సి.హెచ్ లుధియారాణి, హెల్త్ అసిస్టెంట్, ఆశాలు పాల్గొన్నారు.

# దివిలి కిట్స్ నందు దండి మార్చ్ 2.0, మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కాలెజి నందు కాలేజ్ ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ఎండి బేతినీడి సృజన్ల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదిన వైబ్రెంట్స్ ఆఫ్ కలామ్ ఆర్గనైజేషన్, విజయ్ కలామ్ గారి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ పొన్నల దినకర్ సారధ్యంలో పెద్దాపురం నియోజకవర్గ సమన్వయకర్త బొండల రామలక్ష్మీ శ్రీనివాస్ పర్యవేక్షణలో దండి మార్చ్ 2.0, మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించబడునని నిర్వాహకులు బొండల రామలక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. దీనిని పురస్కరించుకుని మంగళ వారం సాయంత్రం కిట్స్, డిప్లమో, ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ మరియు సదస్సులు నిర్వహించారు. ప్రస్తుత ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే నష్టాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. నేటియువతలో కొంతమంది మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, తెలిపారు. ప్రతీ విద్యార్థి వీటిపై తల్లితండ్రులకు, బంధువులకు, స్నేహితులకు



మాదక ద్రవ్యాలు వలన కలిగే నష్టాల గురించి తెలియజేయాలని, బొండల రామలక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. దీనికి ముందుగా కళాశాల నందు 100 మీ. మూడు రంగుల జాతీయ జెండాను విద్యార్థులు, ఉపాధ్యాయులచే ప్రదర్శించారు. ఈ కార్యక్రమ ంలో కళాశాల ఎండి బి.సృజన్‌బాబు, ప్రిన్సిపాల్స్ వి.సర్వరామేశ్వరుడు, వై.రత్నసింధు, ఇఓ జెన్నిబాబు, ఏఓ పెదకాపు, టిచింగ్ & నానన టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## సావిత్రిబాయి పూలే మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** సావిత్రిబాయి పూలేను మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావు అన్నారు. మంగళవారం స్థానిక హై స్కూల్ ఆవరణలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి టీవీఎస్ రంగారావు పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ సావిత్రిబాయి పూలే ని ఆదర్శంగా తీసుకోవాలని మహిళలందరూ పురుషుడితో పాటు సమాన హక్కులు కలిగి ఉన్నారన్నారు. ఆమె ఉపాధ్యాయునిగా అవతరించి మహిళలందరికీ విద్య నేర్పించడం వలనే ఈరోజు మహిళలు అందరూ అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళ విద్యకు పునాది వేసి సమాజంలో సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి అని అన్నారు. వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిఎస్ మూర్తి చక్రవర్తి హిందీ ఉపాధ్యాయులు డి పద్మావతి సత్య ఉమాలక్ష్మి పిడి వరలక్ష్మి భాను తదితరులు పాల్గొన్నారు.

# గోరింట, వడ్లమూరులలో వ్యవసాయ శాఖ జెడి పంట పొలాల పరిశీలన



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :పెద్దాపురం మండలం, గోరింట, వడ్లమూరు లలో మంగళవారం వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్ కుమార్ పంట పొలాలను పరిశీలించారు. దీనిలో భాగంగా వరి, మొక్కజొన్న చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ వరిపంటలో ముఖ్యంగా వాతావరణాన్ని బట్టి ముప్పపోటు, దోమపోటు అధికంగా సోకే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జెడి సూచించారు. ప్రస్తుతం వరిచేలు అంకురం ఏర్పడే దశలో ఉన్నందున్న పొటాష్ ఎరువు వినియోగించాలని దానివలన చేను తెగుళ్లను, పురుగులను తట్టుకుంటుందని, అలాగే ఫార్మర్ రిజిస్టర్‌లో రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని 11 అంకల విశిష్ట సంఖ్యను పొందాలని తెలిపారు. రాబోయే కాలం విశిష్ట సంఖ్య ఆధారంగా వ్యవసాయ శాఖ ద్వారా అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సబ్సిడిపై ఎరువులు, ఇన్‌సెట్ సబ్సిడిలు, వ్యవసాయ శాఖ అందించే సబ్సిడిలు అందుతాయని ఆయన తెలిపారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకోనివారు రైతు సేవా కేంద్రం సంప్రదించి, త్వరగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న టువంటి ఊబరైజేషన్ ద్వారా డ్రోన్లతో పురుగుమందుల పిచికారి రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి కె.సంజయ్ కుమార్, కూటమి నాయకలు, నీటి సంఘం అధ్యక్షులు దేవళ్ళ బోస్, దూసర్లపూడి యేసుబాబు, ఎఎంసి డైరెక్టర్ జల్దాని సుబ్రహ్మణ్యం, కర్రి భాస్కరాజు, పచ్చిపాల యేసు, విఏఏలు, వీఆర్వోలు, జడ్ బి ఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు చర్యలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో నేర నివారణ చర్యల్లో భాగంగా, ప్రజల్లో అప్రమత్తత మరియు చైతన్యం కలిగించే ఉద్దేశంతో ప్రజా కూడలిలో మంగళవారం సిఐ జి. శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాలు, ఏటీఎం కార్డు మార్పు మోసాలు, మొబైల్ ఫోన్ దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, మోటార్ సైకిల్ దొంగతనాలు మరియు రాత్రి వేళల్లో ఇళ్లలో జరిగే దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించి నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి నేర నివారణకు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం యొక్క ప్రాముఖ్యత గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.

## సీఎం చంద్రబాబు నాయుడిని కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మంగళవారం అమరావతిలో కలిసి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవపై సూచనల నివేదిక అందజేశారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలపాటు పేదల నుంచి రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ముఖ్యమంత్రికి తెలియజేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 4500 కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీకి కేటాయించి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సరే పేదవాడు ఆరోగ్యమే ముఖ్యమని ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు పెడుతుంటే... వేల కోట్ల రూపాయలు రోగుల్నించి అదనంగా దోచుకుంటున్న హస్పటల్స్ కి చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యం గురించి పేదవాడికి ఇంట్లో పెద్ద కొడుకుగా ఉంటానన్న చంద్రబాబు హామీ పక్కాగా అమలవుతోంది అని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల వైద్య ఖర్చులు అందజేస్తున్నట్లు తెలిపారు.

## మద్యం షాపులపై దాడులు, ముగ్గురు వ్యక్తుల అరెస్టు

– ఎస్ఐ శివకుమార్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని వట్టిగడ్డ గ్రామంలో 2 బెల్ట్ షాపులు పైదాడులు నిర్వహించి ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి 35 మద్యం బాటిల్స్ సీజ్ చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. అలానే సారాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 10 లీటర్ల సారా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం ఇంచార్జ్ ఏఎస్పీ బొద్దు హేమంత్ ల ఆదేశాల మేరకు మంగళవారం రాజవొమ్మంగి సీఐ గౌరీ శంకర్, ఎస్సై శివకుమార్ ఆధ్వర్యలో వట్టిగడ్డ గ్రామంలో బెల్ట్ షాపులు మరి యు సారాయి దుకాణాల్లో దాడులు నిర్వహించామన్నారు.ఈ దాడు ల్లో రెడ్డి కన్నబాబు(నానాజీ )దగ్గర 10 లీటర్లు సారా సీజ్ చేశారు. విశ్వంశెట్టి అప్పలనాయుడు దగ్గర 13 డిపిఎల్ బాటిల్స్, గంపు విజయ లక్ష్మీ దగ్గర 22 డిపిఎల్ బాటిల్స్ సీజ్ చేసి వారిపై విడివిడిగా ఒక్కొక్కరిపై ఒక్కో కేసు నమోదు చేసి, ఎస్సై శివకుమార్ దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా సారాయి, బెల్ట్ షాపులు నిర్వహిస్తేకఠినచర్యలు తీసుకుంటామని సీఐ,ఎస్సైలు హెచ్చరించారు.

# అన్నవరం రత్నగిరిపై 'ఎక్స్‌పైరీ' దందా!








- భక్తుల ఆరోగ్యంతో లీజు వ్యాపారుల చెలగాటం
- రాజగోపురం ఎదుట షాపుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు తనిఖీలు
- భారీగా నిల్వ ఉంచిన కాలం చెల్లిన పానీయాల స్వాధీనం..కేసు నమోదు
- ఇవో త్రినాథ్ లీజు రద్దు చేస్తారా! షాపుకు తిరిగిపాట పెడతారా వేచి చూద్దాం !

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానంలో భక్తుల నమ్మకాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.పవిత్రమైన రత్నగిరిపై అడుగుపెట్టేభక్తులకు నాణ్యమైన సేవలు అందించాల్సింది పోయి, వారి ప్రాణాలతో చెలగాటమాడుతు న్నారు.శ్రీ స్వామివారి పడమర రాజగోపురం ఎదురుగా ఉన్న దుకాణాల్లో సాగుతున్న అక్రమాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు బట్టబయలు చేశారు.

**నిబంధనలు గాలికి.. వ్యాపారమే పరమావధి**

శ్రీ సత్యదేవ ఫాన్సీ కోకోనట్ మరియు కూల్ డ్రింక్స్ షాపులో ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ నందాజీ, ఇన్స్పెక్టర్ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈతనిఖీల్లో విస్తుపోయేనిజాలు వెలుగు చూశాయి.షాపులోనిఅరల్లోఅమ్మకానికి ఉంచినశీతలపానీయాల్లో మెజారిటీ బాటిళ్లు గడువుముగిసినవి కావడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు.

**చట్టం ఏం చెబుతోంది?**

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 ప్రకారం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడం తీవ్రమైన నేరం. ఈ చట్టంలోని సెక్షన్ 59 ప్రకారం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా వ్యవహరిస్తే భారీ జరిమానాతోపాటు జైలు శిక్ష విధించే అధికారం అధికారులకు ఉంది. తనిఖీల్లో పట్టుబడిన స్టాక్‌ను సీజ్ చేయడమే కాకుండా, నివేదిక ఆధారంగా సదరు వ్యాపారి లైసెన్స్‌ను రద్దు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారు.

**లీజు నిబంధనలు ఉల్లంఘిస్తే వేటు తప్పదు!**

దేవస్థాన పరిధిలోలీజుకు తీసుకున్న దుకాణదారులు ధర్మకర్తృత్వ మండలి నిబంధనలకు కట్టుబడి ఉండాలి. భక్తుల భద్రత దృష్ట్యా, ఇలాంటి అక్రమాలకు పాల్పడినవారిపై దేవస్థానం తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం..ఒకసారి ఉల్లంఘన రుజువైతే సదరు షాపు లీజును రద్దు చేసి,సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేసే అధికారం దేవస్థానానికి ఉంది. అంతేకాకుండా, భక్తులకు భవిష్యత్తులో జరిగే వేలం ప్రక్రియల్లో పాల్గొనకుండా సదరు వ్యక్తులను 'బ్లాక్ లిస్ట్'లో పెట్టే అవకాశం ఉంది.

**అధిక ధరల దందా..ఆరోగ్యానికి చేటు..**సాధారణంగానే కూల్ డ్రింక్స్ వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తుంటారు. అలాంటిది కాలం చెల్లిన పానీయాలను తాగితే భక్తుల పరిస్థితి ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.దీనికి తోడు ఎక్స్‌పైరీ స్టాక్ విక్రయిస్తూ, మరోవైపు ఎంఆర్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. నిల్వ ఉంచిన ప్రదేశాల్లో కనీస శుభ్రత పాటించడం లేదు.

**అధికారుల కొరడా..**తనిఖీల్లో దొరికిన ఎక్స్‌పైరీ బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకుని, సదరు యజమానిపై చట్టపరంగా కేసు నమోదు చేశారు. "దేవస్థానం లీజు షాపులని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. భక్తుల ఆరోగ్యంతో ఆడుకుంటే లైసెన్సులు రద్దు చేస్తాం" అని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

**కఠిన చర్యలు తప్పవు: అధికారులు..**ఈ తనిఖీల అనంతరం ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ నంద,ఫుడ్‌సేఫ్టీఆఫీసర్ ప్రసాద్‌లు మాట్లాడుతూ.. పవిత్ర పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఇలాంటి అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కఠినశిక్షలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం నిఘాకొనసాగుతుందని, నిబంధనలు అతిక్రమించే వారిపై వేటు వేస్తామని స్పష్టం చేశారు.

## అమరజీవి పట్రా ముత్యం ఆశయాలను కొనసాగిస్తాం - సిపియం



**చింతూరు, మేజర్ న్యూస్ :** అమరజీవి కామ్రేడ్ పట్ర ముత్యం 12వ వర్ధంతి కార్యక్రమాన్ని తుమ్మల గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్థూపం వద్ద ముత్యం చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, సీసం సురేష్‌లు పూలమాలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్ లు మాట్లాడుతూ బ్రతికున్నన్ని రోజులు ఆదివాసి ప్రాంత సమస్యలపై, గిరిజనులను చైతన్యం చేస్తూ, ఐక్య పోరాటాలు నిర్వహించి ఎర్రజెండా ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా ఎనలేని కృషి చేసిన వ్యక్తి అమరజీవి కామ్రేడ్ పట్ర ముత్యం అని అన్నారు. మావోయిస్టులు 2014లో అర్ధాంతరంగ ముత్యంను హతమార్చడం వారి దిగజారుతనానికి నిదర్శనమని అన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆదివాసి ప్రాంత వ్యతిరేక విధానాలపై, ఆదివాసి హక్కులు, చట్టాల రక్షణకై ఎర్రజెండా ఆధ్వర్యంలో విస్తృతంగా పోరాటాలు నిర్వహించడమే ముత్యం కిచ్చే నివాళి అని వారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ పేరుతో గిరిజనుల హక్కులు కాలరాయడమే కాకుండా, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు దోచి పెట్టేందుకు ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయని విమర్శించారు. తునికాకు పంటను, ఉపాధి హామీ చట్టాన్ని నీరు కార్చడం ద్వారా గిరిజనులు సంపాదించే రెండు పంటల ఆదాయాన్నికి గండి కొడుతున్నాయని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన రెండు సంవత్సరాలు కావస్తున్న గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పన గాలికి వదిలేశారని హెద్దేవా చేశారు. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదివాసి ప్రాంతంలో జరుగుతున్న నష్టదాయకమైన విధానాలపై యువత మేలుకోవాలని, సిపిఎం చేసే పోరాటాలకు అండగా నిలబడి హక్కులు చట్టాలు రక్షణకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆదివాసీలను ఐక్యం చేసి పోరాటాలు విస్తృతం చేయడమే ముత్యంకిచ్చే నివాళి అని, ఆ దిశగా ముత్యం ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు మొట్టం రాజయ్య, మల్లం సుబ్బమ్మ, పొడియం లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, వేక రాజ్ కుమార్, చింతా రాంబాబు, పట్రా రమేష్, కలుముల మల్లేష్, సోడి రాఘవయ్య, సోడి రెడ్డి, పొడియం జానీ, రామారావు, కలుముల ముత్తయ్య, సోడి దుర్గారావు, ముత్యం కుటుంబ సభ్యులు రాధాకృష్ణ, పాపారావు, చిట్టెమ్మ, నాగమణి, జయ తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాధి పెంపుదలే లక్ష్యం

### - బాంబూ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించిన ఇండస్ట్రీ ఫౌండేషన్ మరియు సెర్ప్

**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** ఆంధ్రప్రదేశ్: మహిళల ఆర్థిక సాధికారత, వాతావరణ చర్యలు మరియు ప్రకృతి ఆధారిత సుస్థిర వాల్యూ చైన్స్ అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉన్న భారతదేశంలోని ప్రముఖ సంస్థలలో ఒకటైన ఇండస్ట్రీ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎస్ఆర్ఎల్ఎం), సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) భాగస్వామ్యంలో, పోలవరం జిల్లాలోని మారేడుమిల్లి మండలంలో బాంబూ ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ (పిపియూ)ను ప్రారంభించింది. పిపియూ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, మహిళా మరియు శిశు సంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అలాగే సెర్ప్ సీఈఓ వి.కరుణ పాల్గొన్నారు. సందర్భంగా సెర్ప్ సీఈఓ వి.కరుణ మాట్లాడుతూ "మారేడుమిల్లిలో ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపన ఆంధ్రప్రదేశ్‌లో బాంబూ ఉపరంగాన్ని బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. సుమారు 8,000-9,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ యూనిట్, బాంబూ సాగు మరియు మార్కెట్‌కు సిద్ధమైన ఉత్పత్తుల మధ్య కీలక సంబంధాన్ని ఏర్పరచడమే కాకుండా, ఈ ప్రాంతంలోని మహిళలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలను కల్పిస్తుంది" అని తెలిపారు. ఈ భాగస్వామ్యంపై మాట్లాడుతూ ఇండస్ట్రీ ఫౌండేషన్ సీఈఓ నేజు జార్జ్ అబ్రహం మాట్లాడుతూ "సెర్ప్‌తో భాగస్వామ్యంగా మేము బాంబూ తోటల ఏర్పాటులో మరియు విలువ గొలుసు కార్యకలాపాల్లో ఒక లక్ష మంది మహిళలను భాగస్వామ్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. తక్షణ కాలంలో ఈ కార్యక్రమం ఆదాయ అవకాశాలను సృష్టించి స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. దీర్ఘకాలంలో గ్రామీణ వ్యాపారాలు, సుస్థిర ఉత్పత్తి మరియు సమగ్ర అభివృద్ధికి మద్దతు ఇచ్చే బలమైన బాంబూ ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఇది సహాయపడుతుంది" అని తెలిపారు.బాంబూ విలువను బలోపేతం చేసే విస్తృత లక్ష్యంతో ఇండస్ట్రీ ఫౌండేషన్ మరియు సెర్ప్ నవంబర్ 2024లో ఐదేళ్ల అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత మరియు సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా బాంబూ తోటల కార్యకలాపాల్లో ఒక లక్ష మంది మహిళలను భాగస్వామ్యం చేయడం మరియు గ్రామీణ మహిళలకు బాంబూ ఆధారిత జీవనోపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

– టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల
– టీడీపీలో గ్రూపుల వివాదం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతోందని అందుకు తమ ఇద్దరి కూటమి నేతల పరస్పర సహకారం వల్లే ఇది సాధ్యమవుతుందని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ విలేకరులతో సమావేశం నిర్వహించి రాష్ట్రంలో జరుగుతున్న రెండేళ్ల పాలన ప్రగతిపై వివరించారు.
ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 6వేల కిలోమీటర్ల సిసి రోడ్లు 15 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లతో పాటు రాజధాని అభివృద్ధి పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతూనే ఉన్నారు నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు అమలు చేసేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయని చెప్పారు. విశాఖలో జరిగిన సమిట్లో ఉద్యోగాలు కల్పనకు అలాగే 16 వేలు డిఎస్సి ద్వారా ఉద్యోగాలు, వందల సంఖ్యలో పోలీసు ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జల్ జీవన మిషన్ ద్వారా 24 వేల కోట్లు కేంద్రం నుంచి విడుదల అయిన నిధులలో 2400 కోట్లు మాత్రమే గత వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. జల్ జీవన్ మిషన్ నిధులను సకాలంలో వినియోగించుకోవడంతో రాష్ట్రంలో 90 లక్షల గృహాలకు మంచి నీటి కనెక్షన్ ఇవ్వలేకపోయామని చెప్పారు. తిరిగి డిప్యూటీ సీఎం పవన్ చొరవతో ఆ పథకాన్ని పునరుద్ధరించి పనులు ప్రారంభించామని జ్యోతుల వెల్లడించారు. మూడో విడతలో రోడ్ల నిర్మాణం ప్రారంభమైందని రాష్ట్రంలో అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని జ్యోతుల చెప్పారు.
ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పిల్లి అనంతలక్ష్మి, నురుకుర్తి వెంకటేశ్వర్ రావు, పిల్లి సత్యనారాయణమూర్తి, పెంకే శ్రీనివాస్ బాబా, కటకంశెట్టి బాబి, కొల్లాబత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో ఇరు గ్రూపుల బాహాబాహి

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఇన్చార్జిల నియామక విషయంలో ఇరువురు గ్రూపుల మధ్య ఎప్పటినుంచో వివాదం రేగుతోంది. ఆ వివాదం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఇరు గ్రూపులు మధ్య బయటపడింది. ఒక గ్రూపుపై ఒకరు కేకలు వేసుకుంటూ సమావేశం నుంచి అర్ధాంతరంగా బయటకు వచ్చారు. దీంతో ఇరువు వర్గాల మధ్య కొంతసేపు పెనుగులాట జరిగింది. విలేకరుల సమావేశం ముందు టీడీపీ కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గంకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కమిటీ సమావేశానికి కో–ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కోకో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ గ్రూపులు హాజరయ్యాయి. సమావేశంలో జరుగుతుండగా నవీన్ కుమార్ ప్రసంగించిన తర్వాత చిక్కాల రామచంద్ర మాట్లాడారు. తిరిగి కటకంశెట్టి బాబీ కూడా ప్రసంగించారు. తర్వాత కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మాట్లాడుతుండగా బాబీ వర్గీయులు సమావేశం నుంచి వెళ్లిపోవడంతో పిల్లి గ్రూపు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. బాబీ మాట్లాడుతుండగా తామంతా ఉన్నామని తమ నేత పిల్లి మాట్లాడుతుండగా వారు వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆ విధంగా కొంతసేపు ఇరు గ్రూపుల మధ్య వివాదం రేగింది. బాబి గ్రూపునకు చెందిన ఒక మహిళను పిల్లి మనుషులు అడ్డుకున్నారని ఒక్కసారిగా వివాదం తలెత్తి ఒకరిపై ఒకరు అరుపులు కేకలు వేసుకున్నారు. దీంతో ఆ మహిళ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్‌కు కన్నీటి పర్యంతో ఫిర్యాదు ద్వారా వివరించింది. దీనిపై ఆయన స్పందిస్తూ అన్నీ తెలుసుకుంటానని విచారణ చేసి తగు చర్యలు చేపడతామని ఆమెకు నవీన్ బదులిచ్చారు.

## సత్యదేవుని సన్నిధిలో ఆదాయపు పన్ను చీఫ్ కమిషనర్ దండ శ్రీనివాస్, వీఎస్పీ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ఆదాయపు పన్ను చీఫ్ కమిషనర్ దండా శ్రీనివాస్ దంపతులు సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు పండితులు ఘన స్వాగతం పలికారు.
అనంతరం శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం ఏఈఓ దామోర కృష్ణారావు శ్రీ స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు.

# బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత




కాకినాడ, మేజర్ న్యూస్ : బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి పేర్కొన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆదేశాలతో మార్చ్ 2వ తారీకు నుండి మార్చి 20 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ అర్బన్ సిడిపిఒ జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట మార్కెట్ పరిధిలో అంగన్వాడీ సెంటర్ నందు పురుషులకు వంటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ బేటీ బచావో – బేటీ పడావో, బాల్య వివాహాలకు నో చెప్పండి, ఆడబిడ్డను కాపాడండి – చదివించండి , బాలికల విద్యను ప్రోత్సహిద్దాం, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం, అమ్మాయిలు మన సమాజానికి ఆస్తి వంటి విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిసిపిఎన్‌డిటి చట్టం గురించి గర్భంలో శిశు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని ప్రజలకు వివరించారు.
అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జె.విజయ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112,181 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమములో కాకినాడ అర్బన్ సెక్టార్ ఈఓ లు గౌరి, అరుణ దుర్గంబ, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది సోషల్ వర్కర్ యస్ చిన్న బాబు, ఓఆర్‌డబ్ల్యూ ఆర్.దుర్గా భవాని, వన్ స్టాప్ సెంటర్ అడ్వకేట్ నాగలక్ష్మి, చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్చంద సంస్థ మరియు అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

## ముందస్తు గుర్తింపుతో వికలాంగ తీవ్రత తగ్గించవచ్చు



రావులపాలెం, మేజర్ న్యూస్ : మూడు సంవత్సరాల లోపు పిల్లల సమస్యలను గుర్తించగలిగితే వారి వికలాంగత్వ తీవ్రత తగ్గించవచ్చని, వారియొక్క అభివృద్ధికి గ్రామస్థాయిలో పనిచేస్తున్న విలేజ్ లెవెల్ ఫ్రంట్ లైన్ హెల్త్ వర్కర్స్ బాధ్యత ఎంతైనా ఉందని పారా సంస్థ కోఆర్డినేటర్ బదుగు సుబ్బమ్మ తెలిపారు. దివ్యాంగ పిల్లలను తొలి దశలోనే ఎలా కనిపెట్టాలి, ఏ డాక్టర్కు రెఫర్ చేయాలి అనే విషయాలు మీద అవగాహన సదస్సును ఊబలంక గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సంగా ల్యాప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బదుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ, పెన్షన్లు, వారికున్న రాయితీలు గురించి, ప్రతి గ్రామస్థాయి కమిటీలలో దివ్యాంగులు భాగస్వామ్యం ఉండాలి అనే విషయాన్ని అక్కడ ఉన్న అధికారులకు, స్టేట్ హోల్డర్స్కు తెలియజేశారు. అలాగే వారి భాగస్వామ్యం గ్రామంలో పనిచేసే అందరి బాధ్యత అని కోరారు. ఈ కార్యక్రమానికి రాలి పిహెచ్చి సూపర్వైజర్ శామ్యూల్, ఊబలంక పిహెచ్చి సూపర్వైజర్ చిట్టిబాబు, బదుగు మహిమరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.2,50,000లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్ వాస్తవ్యులు దుగ్గిరాల అనంత రామ శర్మ, హేమ వాణి దంపతులు రూ.2,50,000లు విరాళం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం మార్చి 8వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతను దేవస్థాన అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దామోర కృష్ణారావు, సి సెక్షన్ చెక్కుల రమణ పాల్గొన్నారు.

## కోటి రూపాయలతో అన్నదాన సత్రం భవనానికి శంకుస్థాపన



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రాబోయే గోదావరి పుష్కరాల నేపథ్యంలో యాత్రికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు తెలిపారు. మంగళవారం ఆయన పొడగట్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2027 గోదావరి పుష్కర నిధులలో భాగంగా .1 కోట్ల రూపాయలతో నిర్మించనున్న శ్రీ ఉప్పలపాటి జానకయ్యమ్మ అన్నదాన సత్రం భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్నదానం, విశ్రాంతి వంటి సదుపాయాలు అందించేందుకు ఈ సత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. పుష్కరాల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధి, పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

# క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి టీకాలు



– కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీషాదేవి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** క్యాన్సర్ రోగానికి ముందస్తు నివారణ చర్యలు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో తీసుకుంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'హ్యూమన్ పాపిల్లోమా వైరస్' (హెచ్‌పివి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య శాఖాధికారి పి.సరిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శిరీష దేవికి వైద్య సిబ్బంది, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ముందస్తుగా సరైన అవగాహన లేకపోవటంతో అనేకమంది రోగాలు బారిన పడుతున్నారని, మహిళలు ఎక్కువగా క్యాన్సర్ వ్యాధులతో బాధ పడుతున్నారని, క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయం, గొంతు, జననేంద్రియ క్యాన్సర్ వ్యాధుల బారినుండి 90 శాతం వరకు రక్షణ ఉంటుందన్నారు. ప్రస్తుతం 9 నుండి 14 సంవత్సరాలు మధ్య వయసు గల బాలికలకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆయా వయసులో ఉన్న వారికి నూరు శాతం వ్యాక్సిన్ పూర్తి చేయాలని సూచించారు. దీనిలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నేటి నుండి జిల్లా వ్యాప్తంగా ఉన్న 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 14 సంవత్సరాల వయసు ఆడపిల్లలకు ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. ఈ వాక్సిన్ ఆడవారిలో వచ్చే గర్భాశయ క్యాన్సర్ నుంచి కాపాడుతుందన్నారు. 3 నెలల పాటు ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. అలాగే ప్రతి బుధవారం శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌పివి వాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 3,830 మంది 14 సంవత్సరాల ఆడపిల్లలకు ఈ వాక్సినేషన్ వేయనున్నట్లు తెలిపారు. వాక్సిన్ వేయించు కోవడానికి పిల్లల ఆధార్ కార్డు, తల్లితండ్రుల నుంచి ధ్రువీకరణ తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు.

ఆశా కార్యకర్తలు కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఆమె పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కూటమి కార్యకర్తలు గ్రామాల్లో సమస్యలు ఆమె దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులను పరిష్కారం చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభానీ, కారం సింహాచలం, అసియామొహిద్దీన్, సూరిబాబు, ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి పి.సరిత, డిఐఒ డాక్టర్ పీవీఎల్ నీలిమ, ఆర్.వినోద్ కుమార్, కూటమి నాయకులు అన్నిక అప్పారావు, ముర్ల అన్నవరం, తీగల రాజారావు, అన్నిక గంగరాజు, నెరం వీరస్వామి, నెరం అబ్బులు, లండా ప్రవీణ్ కుమార్, దారా అప్పలకొండ, కడబాల ఈశ్వరరావు, కారం నందిని, తీగల కుమారి, వలల బాలకృష్ణ, కాకర అబ్బులు, పూల భాస్కర్, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ కి పరామర్శ..కార్యకర్తల కష్టాన్ని తన కష్టంగా భావిస్తానని రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు.

రంపచోడవరంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ వైస్ ఎంపీపీ వై. సుభాష్ చంద్రబోస్‌ను మంగళవారం ఆమె పరామర్శించారు. రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి భర్త మాజీ వైస్ ఎంపీపీ వై.సుభాష్ చంద్రబోస్ ను ఆమె పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు సూర్య ప్రకాష్, వైద్యులు రాహుల్ లను ఆయన వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

# పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు






– జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈనెల 16 నుండి జరగబోవు పదో తరగతి పరీక్షలు పోలవరం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పోలవరం జిల్లా విద్యాశాఖాధికారి రామకృష్ణారావు పేర్కొన్నారు.

మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం సమావేశం హాలులో ఎస్ఎస్‌సి, ఏపీఓ ఎస్ఎస్ పరీక్షలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సీఎస్డీఓ లు, పరీక్షల నిర్వహణా అధికారులతో శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశి కుమార్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఈనెల 16 నుండి ఏప్రిల్ 1 తేది వరకు జరగబోవు పదో తరగతి, అలాగే మార్చి 16 తారీకు నుండి 28వ తారీకు వరకు ఓపెన్ ఇంటర్, ఓపెన్ పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పోలవరం జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 72 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షలకు 4,184 మంది పరీక్షలు హాజరవుతారన్నారు. అదేవిధంగా పోలవరం జిల్లాలో ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 608 మంది పరీక్షలకు హాజరవుతారని, అదేవిధంగా జిల్లాలో 5 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓపెన్ పదవ తరగతి పరీక్షలకు 414 మంది పరీక్షలకు హాజరవుతారని, 3 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సిట్టింగ్, ఫర్నిచర్, త్రాగునీరు, టాయిలెట్స్, మెడికల్, అన్ని సదుపాయాలు ఉన్నాయా లేవా అని ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ఏర్పాట్లు చేసుకునే విధంగా అధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి సెంటర్‌కు ఒక స్పెషల్ ఆఫీసర్ ను అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.50 గంటలకు అనుమతించడం జరుగుతుందని, ఉదయం 10:00 గంటల తర్వాత పరీక్ష కేంద్రాలకు అనుమతించడం జరగదన్నారు. అలాగే పరీక్ష పేపర్లు స్టోరేజ్ పాయింట్ నుండి పరీక్ష కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రతతో తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పరీక్షలు ఏ విధంగా నిర్వహించాలి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరూ కలిసికట్టుగా ఈ పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా అందరి సహకారం కావాలని ఆయన కోరారు. పోలవరం జిల్లాలో పదో తరగతి పరీక్షలు గత సంవత్సరం ఈ సంవత్సరం అధిక శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అందరూ తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండగయ్య, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఇన్స్ట్రక్టర్ రత్న కుమార్, డిఎల్ఓ సి.విజయేంద్ర రావు, మండల విద్యాశాఖ అధికారులు ఏ.ఎల్. నరసింహారావు, ఆర్.ఎల్. శ్రీనివాసరావు, జి. సుబ్రహ్మణ్యం, ముత్యాలరావు, చీఫ్ సూపర్డెంట్లు, సిఎస్‌డివోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మారుమూల పల్లెలో సిఆర్‌పిఎఫ్ వైద్య శిబిరం

– ఉచితంగా మందుల పంపిణీ. అవగాహన సదస్సు



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మన్యంలోని మారుమూలన ఉన్న అల్లిగూడెం అనే మారుమూల గ్రామంలో మంగళవారం సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తుల కోసం సిఆర్‌పిఎఫ్ 141 బెయటాలియన్ ఈ ఉచిత శిబిరానికి శ్రీకారం చుట్టింది. అల్లిగూడెంలో 87వ సీఆర్‌పీఎఫ్ రైజింగ్ డే సందర్భంగా ఎస్.హెచ్. రితేష్ ఠాకూర్ కమాండెంట్ 141 బిఎన్‌ఈ ఉచిత వైద్య శిబిరానికి శ్రీకారం చుట్టారు. ఈ వైద్య శిబిరం గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడం మరియు ఆరోగ్య అవగాహన కల్పించడం లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సమీప గ్రామాలకు చెందిన సుమారు 100 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమములో రితేష్ ఠాకూర్ కమాండంట్ 141 బిఎన్ తో పాటు రాజేష్ యాదవ్ (2ఐసి), నాజిల్ (ఎస్ఏంఒ), రామకృష్ణ వేణు బి.(ఏసి), చంద్రయ్య (సర్పంచ్) మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన సీఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేస్తాయని కమాండెంట్ పేర్కొన్నారు.

## ఘనంగా ఆలయ పునర్నిర్మాణ 14వ వార్షికోత్సవ వేడుకలు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఆలయ పునర్నిర్మాణ 14వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా వేకువజామున 3 గంటలకే వేద పండితులు, ఆలయ ప్రధానార్చకులు స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, సుగంధ భరితమైన వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుండి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్లకు లక్ష పత్రి పూజ, ప్రత్యేక నివేదనలు, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైదిక సిబ్బందికి ఘన సత్కారం... ఈ వేడుకలో భాగంగా దేవస్థానంలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వైదిక కమిటీ సభ్యులను దేవస్థానం ప్రత్యేకంగా గౌరవించింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు చేతుల మీదుగా దేశపాద రాజశేఖర శర్మ (వేద పండితులు), శ్రీపాద వెంకట రామ సుబ్రహ్మణ్య శర్మ (అర్చకులు), చాడ శేషగిరి రావు (అర్చకులు), కోటమర్తి సత్యనారాయణ మూర్తి (పురోహితులు), మహేంద్రవాడ సత్యనారాయణ మూర్తి (పురోహితులు) లను ఘనంగా సత్కరించారు.దర్శనం అనంతరం భక్తులకు దేవస్థానం వారు 'కదంబం' ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉన్నతాధికారులు, ఆలయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.